కుక్కల స్వైరవిహారం

- బెంబేలెత్తుతున్న కోదాడ ప్రజలు
- నివారణ చర్యలు తీసుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


కోదాడలో సంచరిస్తున్న కుక్కలు

కోదాడరూరల్: వీధి కుక్కల బెడదతో కోదాడ పట్టణంతోపాటు, మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నాయి. పిల్లలు, మహిళలు, ద్విచక్రవాహన దారుల వెంట పడి వారిని గాయాలపాలు చేస్తున్నాయి. రాత్రి వేళల్లో రోడ్లపై గుంపులుగా ఉంటూ వచ్చిన వారిపై దాడికి పాల్పడుతున్నాయి. ఈ వీధి కుక్కల బెడదతో బయటకు వెళ్లిన వారు క్షేమంగా ఇంటికి చేరుకోని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజు ఎక్కడో ఓ చోట ప్రజలు కుక్కకాటుకు గురవుతూనే ఉన్నారు. స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా వాటిని అరికట్టలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. కుక్కల సంఖ్య పెరగకుండా బర్త్ కంట్రోల్ సర్జరీలు చేయాల్సి ఉన్నా ఆదిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక మున్సిపాలిటీ అధికారులు అప్పుడప్పుడు కుక్కలను పట్టి వేరే చోటకు తరలిస్తున్నా నెలరోజుల తర్వాత యాథావిధిగా అవి వస్తూనే ఉన్నాయి.

శివారు ప్రాంతాల్లో వ్యర్థాలు వేస్తుండడంతో..

పట్టణ, గ్రామాల శివారులో పలు రకాలు వ్యర్థాలతో పాటు పశువుల కళేబరాలను పడేస్తున్నారు. వాటిని తినేందుకు కుక్కలు శివారు ప్రాంతాలకు గుంపులుగా వస్తున్నాయి. ఈ సమయంలో అటుగా వెళ్లిన పాదచారులు, వాహనదారుల వెంట పడుతున్నాయి. దీంతో వాహనదారులు ఆందోళనకు గురై అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద సర్వీస్ రోడ్డు వెంట ఇదే విధంగా ఓ ద్విచక్రవాహన దారుడి వెంట రెండు కుక్కలు వెంటపడగా అతను కిందపడ్డాడు. అటుగా వెళ్తున్న పశువుల కాపరి వాటిని తరమడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. నెల రోజుల కిందట మండలంలోని ఓ గ్రామంలో అంగన్‌వాడీకి వెళ్తున్న ఓ చిన్నారిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి.

నివారణ చర్యలు తీసుకోవాలి



కోదాడ పట్టణంలోని వీధుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మహిళలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులపై దాడులు చేస్తున్నాయి. అధికారులు స్పందించి పట్టణంలో వీధి కుక్కలు లేకుండా పూర్తిగా నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.

– గాలి శ్రీనివాసనాయుడు, కోదాడ

పెద్దచెరువులో అక్రమ కట్టడాల కూల్చివేత


అక్రమ కట్టడాలను కూల్చివేయిస్తున్న అధికారులు

కోదాడ: కోదాడ పెద్దచెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఆదివారం కూల్చివేశారు. చెరువు శిఖంలో ఆర్ఎస్‌వీ ఫంక్షన్ హాల్ పక్కన మునక పట్టాపేరుతో దాదాపు 600 గజాల స్థలాన్ని ఆక్రమించడానికి కొందరు వారం రోజుల క్రితం ప్రహరీ నిర్మాణం చేపట్టారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఈ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఆ మరుసటిరోజు నుంచే పనులు మొదలుపెట్టి గోడ నిర్మాణం పూర్తి చేశారు. దీనిపై సామాజిక కార్యకర్త బసవయ్య అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆదివారం కట్టడాన్ని కూల్చివేశారు. చెరువు శిఖంలో ఎలాంటి నిర్మాణాలు చేయొద్దని హెచ్చరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోరారు. ఆదివారం కోదాడ బాలుర పాఠశాలలో తలసేమియా బాధితుల కోసం ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ ప్రకాశ్, కారింగుల అంజన్‌గౌడ్, పడిశాల రఘు, గణేశ్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే

క్లుప్తంగా

సుష్మ కుటుంబ సభ్యులకు సన్మానం


నర్సిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న రఘు

గరిడేపల్లి: గరిడేపల్లికి చెందిన బండ సుష్మ చంద్రయాన్–3లో ప్రధాన సభ్యురాలుగా ఉన్నారు. ఈమె తల్లిదండ్రులను ఆదివారం మండల కేంద్రంలో ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థానానికి చేరుకుని, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

మఠంపల్లి: మండలంలోని గుర్రంబోడుతండాకు చెందిన వీరబ్రహ్మాచారి ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఓజో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న, ఓజో సభ్యులు తదితరులున్నారు.

కమ్యూనిస్టుల సత్తా చాటుతాం


మాట్లాడుతున్న మట్టిపెల్లి సైదులు

మోతె: బీజేపీతో లోపాయకారి ఒప్పందం చేసుకున్న బీఆర్ఎస్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించి కమ్యూనిస్టుల సత్తా చాటుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు అన్నారు. ఆదివారం మోతె మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో నాలుగు నియోజకవర్గాల్లో అధికార పార్టీని ఓడిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ములుకూరి గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యుడు గుంటగాని ఏసు, కిన్నెర పోతయ్య, చర్లపల్లి మల్లయ్య, సోమగాని మల్లయ్య, లచ్చిరాం పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రవికుమార్

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సోమారం గ్రామానికి చెందిన దోరెపల్లి రవికుమార్ నియామకమయ్యారు. ఈమేరకు ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొనతం చిన వెంకట్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కుక్కడపు మహేష్ ఆయనకు నియమకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బచ్చలకూరి ప్రకాశ్, నాయకులు అజయ్, ప్రవీణ్, శ్రీను, సోమయ్య తదితరులున్నారు.

కృష్ణాష్టమి వేడుకలు విజయవంతం చేయాలి


ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

నేరేడుచర్ల: వచ్చే నెల 15న జరిగే శ్రీకృష్ణాజన్మష్టమి వేడుకలను విజయవంతం చేయాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక కోదాడ కమిటీ అధ్యక్షుడు పోటు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం నేరేడుచర్లలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ఆహ్వానపత్రికలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మహేష్, అరుణ, శైలజ, నాగరాజు, కృష్ణా, విజయభాస్కర్, చందు, శివరామకృష్ణ తదితరులున్నారు.

టీటీడీ పాలక మండలి సభ్యుడికి సన్మానం


రాంరెడ్డిని సన్మానిస్తున్న పీసీసీ సభ్యులు

హుజూర్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదివారం హుజూర్‌నగర్‌లో టీపీసీసీ సభ్యులు ఈడ్పుగంటి సుబ్బారావు, అల్లం ప్రభాకర్‌రెడ్డిలు ఆయనను సన్మానించి, అభినందనలు తెలిపారు.

సెప్టెంబర్ 3న గంగమ్మ జాతర

హుజూర్‌నగర్: ప్రతి ఏటా యాదవుల ఆధ్వర్యంలో నిర్వహించే గంగమ్మ జాతరను సెప్టెంబర్ 3న నిర్వహించనున్నట్లు యాదవ సంఘం పెద్దలు తెలిపారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు తీర్మానం చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీసేవాలాల్, మేరమ్మయాడీ జాతర

మఠంపల్లి: మండలంలోని గుర్రంబోడుతండాలోగల శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్, మేరమ్మయాడీ జాతరను గిరిజనులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పూజారి చంద్రునాయక్ ఆధ్వర్యం లో దేవతల విగ్రహాలను మట్టపల్లి వద్ద గల కృష్ణానదికి ఊరేగింపుగా తీసుకెళ్లి జలసంప్రోక్షణ చేసి, తిరిగి ఆలయానికి తరలించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే సైదిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముడావత్ పార్వతీ, సర్పంచ్‌లు రామారావు, పార్వతి, లక్ష్మీనరసింహరాజు, మాజీ ఎంపీపీ కొండానాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇరుగు పిచ్చయ్య, గుండా బ్రహ్మారెడ్డి, హఫీజ్‌ఖాన్, నవీన్‌నాయక్, సీతారామయ్య, రవీందర్‌నాయక్, శంకర్ నాయక్, ఎంపీటీసీలు తదితరులున్నారు.


దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నడిగూడెం: మండల పరిధిలోని తెల్లబెల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శివంది చంద్రయ్య (60) ఇటీవల మృతి చెందారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి పరామర్శించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు వేపూరి సుధీర్, ముసుకు శ్రీనివాసరెడ్డి, ఆవుదొడ్డి ధనమూర్తి, రవి, వీరబాబు, నరేష్, శ్రీరామ్ తదితరులున్నారు.

బాధిత కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలి


నిత్యావసర సరుకులు అందజేస్తున్న రామకృష్ణ

మునగాల: మండల కేంద్రంలో 30ఏళ్లుగా గుడిసెలో జీవనం సాగిస్తున్న దివ్యాంగులైన తల్లీ కుమారుడిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ కోరారు. ఆదివారం «సాక్షి» దినపత్రికలో «ముప్పై ఏళ్లుగా గుడిసెలో నివాసం» అనే శీర్షికన వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. బీసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు అందించారు. అనంతరం రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన వెగ్గళం రాంబాయమ్మ, ఆమె కుమారుడు వెంకటేశ్వర్లు దివ్యాంగులుగా ఉండి ప్రభుత్వం నుంచి వచ్చే ఆసరా పింఛన్‌తో దుర్భర జీవితాన్ని గడుపుతుండడంతో సాక్షి దినపత్రిక వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. సదరు కుటుంబానికి నేటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, రాంబాయమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్షుడు చింతకాయల నాగరాజు, దొంతగాని నవీన్ గౌడ్, పరుశరామ్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సాల్లేటి వెంకటేశ్వర్లు, రామ్‌లక్ష్మణ్, శివకుమార్, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు రామిరెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్ చేయాలి


దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్

కోదాడరూరల్: ఓటు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి, అభ్యంతరాలు లేకపోతే వెంటనే ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ సాయిగౌడ్ బీఎల్‌ఓలకు సూచించారు. స్పెషల్ ఓటరు క్యాంపెన్ డే సందర్భంగా ఆదివారం కోదాడ పట్టణంలో పలు చోట్ల ఓటరు నమోదు కోసం ఏర్పాటు చేసిన బూత్‌లను ఆయన పరిశీలించి మాట్లాడారు. అర్హులైన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు లిస్ట్‌లో సవరణలు, మార్పులు, చేర్పులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ వెంకటనగేష్, బీఎల్ఓలు ఉన్నారు.

చనిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలి

- ఆర్డీఓ జగదీశ్వరరెడ్డి


ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీఓ జగదీశ్వరరెడ్డి

హుజూర్‌నగర్: చనిపోయిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాలని ఆర్డీఓ జగదీశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించారు. పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మన్సూర్ అలీ చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించలేదని, అదేవిధంగా డబుల్ ఓట్లను కూడా తొలగించలేదని ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం చనిపోయిన వారి మరణ ధ్రువీకరణపత్రం కుటుంబ సభ్యుల ద్వారా తీసుకుని, వారి పేరును జాబితా నుంచి తొలగించాలని చెప్పారు. చనిపోయిన వారి మరణ ధ్రువీకరణ పత్రాలను ప్రతి బీఎల్ఓ వారి ఇంటికి వెళ్లి తీసుకోవాలని, లేదంటే తహసీల్దార్, మున్సిపల్ అధికారులే మృతి చెందిన వారి మరణ ధ్రువీకరణపత్రం తీసుకుని వారి పేరును ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కమలాకర్, బీఎల్‌ఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవతా విగ్రహాల ప్రతిష్ఠ

మఠంపల్లి: మండలంలోని సుల్తాన్‌పూర్‌తండాలో శ్రీసేవాలాల్, మహాలక్ష్మి, బొడ్రాయి, ముత్యాలమ్మ గ్రామదేవత విగ్రహ ప్రతిష్ఠాపనను యాజ్ఞికులు అద్దేపల్లి శ్రీనివాసాచార్యులు, ఫణిభూషణమంగాచార్యుల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని ప్రదక్షిణలు చేసి గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గిరిజనులు పాల్గొన్నారు.


గ్రామదేవతలకు పూజలు చేస్తున్న గిరిజనులు

బిహార్ తరహాలో రాష్ట్రంలో కులగణన చేపట్టాలి

గరిడేపల్లి: బిహార్ తరహాలో తెలంగాణలో కూడా కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ కన్వీనర్ ధనుంజయనాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన చేపట్టకపోవడంతో బీసీ కులాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు. ఏ కులం వారు ఎంత మంది ఉన్నారని లెక్క తేలితేనే జనాభా దామాష ప్రకారం బడ్జెట్‌లో ఆయా కులాల అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం వద్ద తగిన వివరాలు ఉంటాయని తెలిపారు. కుల గణనను వ్యతిరేకించే పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. సోమవారం కోదాడలో ఉదయం 10గంటలకు కోదాడ నియోజకవర్గ స్థాయి బీసీల సమావేశం ఉంటుందని, మధ్యాహ్నం 3గంటలకు హుజూర్‌నగర్ నియోజకవర్గ స్థాయి సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడేపల్లి కృష్ణమాచార్యులు, హాజరవుతారని చెప్పారు. సమావేశాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఎడమ కాలువకు నీటిని విడుదల చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్: సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టు ప్రాంతంలో ఎండిపోతున్న పొలాలను రక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి హుస్సేన్ కోరారు. ఆదివారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని గోపాలపురంలో ఎండిపోతున్న వరి పొలాలను సీపీఎం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో బోరు, బావుల కింద వరినాట్లు వేసి రెండు నెలలు గడిచినా నేటికీ ఆయకట్టు ప్రాంతానికి నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో 450 అడుగులు నీరు ఉన్నా ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం 520 అడుగులు నీరు ఉన్నందున వారబంధీ పద్ధతిలో ఎడమ కాలువలకు నీటిని విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చీకూరి తిరుపతయ్య, చందాల భిక్షం, సిద్దెల వెంకటయ్య, మాధవరావు, సాయిలు, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌రూరల్ : ఎండిపోతున్న వరి పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

వచ్చే ఎన్నికల్లో జిల్లెపల్లి వెంకటేశ్వర్లును గెలిపించాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

నేరేడుచర్ల: రాబోయే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గ వైఎస్సార్‌టీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జిల్లెపల్లి వెంకటేశ్వర్లును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుతారి శ్రీనివాస్‌రావు కోరారు. ఆదివారం నేరేడుచర్లలో పట్టణ అధ్యక్షుడు కుక్కడపు ఉపేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన జిల్లెపల్లి వెంకటేశ్వర్లును గెలిపిస్తే పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మర్రి యశోధరెడ్డి, పాలకీడు, హుజూర్‌నగర్, గరిడేపల్లి మండలాల అధ్యక్షులు గోదాల సుధాకర్‌రెడ్డి, నాగుల్ మీరా, మర్రి రవీందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, నరేష్, శ్రీను, ఎన్‌టీఆర్, మనోజ్, నవీన్ తదితరులున్నారు.

‘చలో హైదరాబాద్’ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మఠంపల్లి: కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కామెళ్ల నవీన్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణలో మహిళా కార్మికులతో కలిసి చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న వర్కర్లకు ఏడునెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే వర్కర్ల వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, గుర్తింపుకార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో సునీత, ఎస్‌కే కాశీంబీ, సునీత, హైమావతి, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నవీన్

మహిళలకు ఎలక్ట్రానిక్ పరికరాలపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లి ఎస్సీ కాలనీలో మహిళలకు ఆదివారం సామాజిక కళాశాల సైఫాబాద్‌కు చెందిన బీఎస్సీ విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలులో తీసుకునే జాగ్రత్తలు, ఫస్ట్ మార్క్ ప్రాముఖ్యతను వివరించారు. రైస్ కుక్కర్, రిఫ్రిజిరేటర్, వాటర్ హీటర్, ఇండక్షన్ స్టౌవ్, టెలివిజన్, ఐరన్ బాక్స్, ప్రెషర్ కుక్కర్, మిక్సర్ గ్రైండర్ గురించి తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువులను కొనేముందు స్టార్ రేటింగ్, ఓల్టేజి ధర, బ్రాండ్ చూసి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రేణుక, వనజ, నాగలక్ష్మి, మాధవి, పూజ, సునీత, పద్మ, సైదమ్మ, విజయలక్ష్మి, లింగయ్య, ఉమ, సంధ్య, నర్సమ్మ, ఉమాదేవి, శ్రీలత, విద్యార్థులు శ్వేత, స్నేహ, అక్షిత, సింధుజ, హర్మిత, మధుమిత, రజిత, నాజిన్, పుష్ప పాల్గొన్నారు.

30న క్రీడాకారుల ఎంపిక

మునగాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 30న స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలబాలికలకు పలు క్రీడల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు సీతరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులు తరగతి, వయసు ధ్రువీకరణ పత్రం తీసుకొని, 30న ఉదయం గం.9.30 గంటలకు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు హాజరుకావాలని తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మ పండుగ


లక్కవరంలో బోనాలతో తరలివస్తున్న మహిళలు, పాల్గొన్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్: మండలంలోని లక్కవరంలో ఆదివారం ముత్యాలమ్మ పండుగ నిర్వహించారు. ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, సర్పంచ్ సౌజన్య పాల్గొన్నారు.

కోదాడ: కోదాడలో ఆదివారం ముత్యాలమ్మ పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు మాతానగర్, ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న అమ్మవారి దేవాలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి బోనంతో ఆలయానికి చేరుకుని, పూజలు నిర్వహించారు.

కోదాడరూరల్: మండల పరిధిలోని గుడిబండలో ముత్యాలమ్మ పండుగ సందర్భంగా ఆదివారం నాభిశిల, గ్రామదేవతల ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఎంపీపీ చింత కవితారాధారెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

మేళ్లచెరువు: మండల కేంద్రంతోపాటు రేవూరు, రామాపురం గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

చిలుకూరు: కొత్త చిలుకూరులో ఆదివారం ముత్యాలమ్మ పండుగ నిర్వహించారు. బొడ్రాయి, ముత్యాలమ్మ దేవాలయాల వద్ద భక్తులు పూజలు చేశారు.

నడిగూడెం: ముత్యాలమ్మ పండుగ సందర్భంగా ఆదివారం నడిగూడెం మండల కేంద్రంలో సారంగేశ్వరచెర్వు వద్ద ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, ఎలకా రామిరెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు


చిలుకూరులో బోనాలతో మహిళలు


గుడిబండలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ


నడిగూడెంలో బోనాలతో మహిళలు, చిన్నారులు


బోనం ఎత్తుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి


మేళ్లచెరువు: రామాపురంలో బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

వట్టె జానయ్యపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

తుంగతుర్తి : వట్టె జానయ్య యాదవ్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని భారత యాదవ సమితి(బీవైఎస్) జిల్లా అధ్యక్షుడు నన్నెబోయిన సుధాకర్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల్లో జానయ్యను మంత్రి తన ఎదుగుదలకు వాడుకొని, ఇప్పుడు అక్రమ కేసులు మోపి ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కేసులు ఎత్తివేయకుంటే బహుజనులంతా ఏకమై ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు యాదవ సంఘం నాయకులు స్వామి, ఉప్పలయ్య, కిష్టయ్య, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.


రావులపల్లిలో మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు